మసక బారుతున్న.. సచివాలయాల ప్రభ

గాంధీ జయంతి సందర్భంగా 2014లో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని ఆవిష్కరించారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలకు సచివాలయాల ద్వారా సుమారు 532 సేవలు అందాయి. అలాంటి గ్రామ స్వరాజ్యానికి ప్రతి రూపాలుగా వెలుగొందిన సచివాలయ వ్యవస్థ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం అవుతోందనే విమర్శలున్నాయి.

- నిర్వీర్యమవుతున్న వ్యవస్థ
- తగ్గిపోతున్న సేవలు.. ఆందోళనలో లబ్ధిదారులు
- నేటికీ ప్రారంభం కాని పలు ప్రభుత్వ వెబ్ సైట్లు
- సంక్షేమ పథకాల దరఖాస్తులు ఎక్కడివ్వాలో అర్థం కాని వైనం



వెంకటేశ్వరమెట్ట 1,2 సచివాలయ భవనం



లబ్ధిదారులు లేక వెలవెలబోతున్న వెంకటేశ్వరమెట్ట-1 సచివాలయం



వెలవెలబోతున్న సచివాలయం

అల్లిపురం: రాష్ట్రంలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందేలా ప్రజల వద్దకు పాలన తీసుకెళ్లేందుకు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. చిన్న, పెద్ద పనులకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా అన్ని సేవలు నియోజకవర్గంలో జనాభా ప్రాతిపదికన రెండు నుంచి నాలుగు సచివాలయాలు ఏర్పాటు చేసి, ప్రతి 50 ఇంటికి ఒక వలంటీర్‌ను నియమించి సేవలు అందజేశారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా అన్ని సేవలు అందేలా ఒక గొప్ప వ్యవస్థను ప్రవేశపెట్టారు. కోట్లు ఖర్చు చేసి సమస్త సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుంది.

లక్షలాది మందికి ఉపాధి..

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయటం ద్వారా కార్యదర్శులు, వలంటీర్ల నియామకంతో లక్షలాది మందికి ఉపాధి కల్పించారు. వలంటీర్ వ్యవస్థతో పేదల గడప వద్దకే పారదర్శక పాలన అందేలా చర్యలు తీసుకున్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామ స్వరాజ్యం ఏర్పడింది. అంతకు మించి అంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలను తొక్కిపెట్టి ఆ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఇప్పుడు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో ఇప్పటికే పలు సేవలు అందడంలేదంటున్నారు. దీంతో లబ్ధిదారులకు ఇబ్బందులు మొదలయ్యాయి. మళ్లీ ప్రభుత్వ కార్యాలయాలు, కూటమి కార్యకర్తల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పని వచ్చింది. రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వంటి సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లు తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం సచివాలయంలో కుల, ఆదాయ, ఎన్బీ వంటి సేవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం కావాలనే నిర్వీర్యం చేస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గతం ఒక వైభవం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందిన సేవలు ఓ వైభవమే. శ్రమ లేకుండా ఉన్న చోటనే సేవలు అందేవి. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సేవలు పారదర్శకంగా వారి గడపకే చేరేవి. దక్షిణ నియోజకవర్గంలో జనాభా ప్రాతిపదికన 67 సచివాలయాలను ఏర్పాటు చేశారు. వాటిలో 450 మంది సిబ్బందిని ప్రజల సేవల కోసం నియమించారు. వారు 532 రకాల సేవలను ప్రజలకు అందించేవారు. 804 మంది వలంటీర్లు తమ పరిధిలోని ప్రజలకు ఇళ్ల వద్దే సంక్షేమ పథకాలు అందించేవారు. ఆధునాతన భవనాలతో సచివాలయాలు ఏర్పాటు చేసి విద్య, వైద్యం, రెవెన్యూ, విద్యుత్ అనుసంధాన సేవలు, వివిధ ధ్రువపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల వంటి సేవలు అందేవి.

పూర్వ వైభవం తేవాలి..

గత ప్రభుత్వంలో సచి వాలయాల ద్వారా అన్ని సేవలు అందేవి. ప్రస్తుతం ఆ సేవలు నిలిపివేశారు. ప్రభుత్వ పథకాలు ఏం వస్తున్నాయి.. ఎప్పుడు వస్తాయి అనేది వలంటీర్ల ద్వారా తెలిసేది. ప్రస్తుతం వారు లేకపోవటంతో సచివాలయాలు బోసిపోయాయి. పిలిస్తే పలికేవారు లేరు. ఉన్న కార్యదర్శులు ఎవరో ఒకరు అందుబాటులో ఉంటున్నారు. తిరిగి పూర్వ వైభవం తేవాల్సి ఉంది.

–బూర్లి చిన్నా, బంగారమ్మమెట్ట కాలనీ

అన్ని సేవలు కొనసాగించాలి..

సచివాలయాల్లో గతంలో అందిన సేవలు కొనసాగించాలి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక చాలా సేవలు ఆగిపోయాయని చెబుతున్నారు. దీని వల్ల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఏ పని చేయించుకోవాలన్నా దూరాభారమైనా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. గతంలో వలంటీర్లు ఇంటికొచ్చి చేసేవారు. మళ్లీ ఆ సేవలు పునరుద్ధరించాలి.

– ఎస్.రవణమ్మ, గౌరీవీధి

కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చింది..

కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలిచ్చింది. ఇచ్చిన హామీలు గాలికొదిలేసి ఉన్న వ్యవస్థలను నాశనం చేస్తుంది. ప్రజలకు ఎంతో ఉపయోగపడే సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. ఇలాగైతే ప్రజలు తిరగబడే రోజులు తొందరలోనే వస్తాయి. అది తెలుసుకుని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను పునరుద్ధరించాలి.

–బి.దేవి, బంగారమ్మమెట్ట

క్లుప్తంగా

మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు



మద్యం దుకాణం ఎదుట భోజనాలు చేస్తున్న మహిళలు, చిన్నారులు

అల్లిపురం: మాకొద్దు మద్యం షాపు అంటూ వారం రోజులుగా భూపేష్‌నగర్ వాసులు ఆందోళన చేస్తున్నారు. దీంట్లో భాగంగా ఆదివారం ఆందోళనకారులు మద్యం దుకాణం ఎదుట వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. అక్కడే చిన్నా, పెద్ద తేడా లేకుండా భోజనాలు చేసి తమ నిరసన తెలిపారు. వారం రోజులుగా ఆందోళన చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గాని, అధికారులు గాని పట్టించుకోకపోవడం పట్ల నిరుసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అభాగ్యుడిని కేజీహెచ్‌లో చేర్పించిన రెడ్‌క్రాస్



అభాగ్యుడిని కేజీహెచ్‌కు తరలిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది

డాబాగార్డెన్స్: రెడ్‌క్రాస్ సొసైటీ అభాగ్యుడిని కేజీహెచ్‌లో చేర్పించి సేవా నిరతి చాటుకుంది. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ఆదేశాల మేరకు ఎంవీపీ సీఐ మురళి, ఎస్సై శ్రీనివాస్ సమక్షంలో లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం సమీపాన గల బస్టాప్‌లో గుర్తు తెలియని అభాగ్యుని కాలికి దెబ్బతగిలి, పురుగులు పట్టేసిన స్థితిలో అవస్థలు పడుతుండడాన్ని ఎంవీపీ సీఐ రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం అందించారు. దీంతో రెడ్‌క్రాస్ సొసైటీ సిబ్బంది అక్కడికి చేరుకుని అభాగ్యుడిని కేజీహెచ్‌కు తరలించారు.

వేడుకగా పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య జీఎస్ఎన్ రాజు తదితరులు

మహారాణిపేట: డాక్టర్ కె.సుహాసిని ఆనంద్ రచించిన డాక్టర్ సాలూరు రాజేశ్వరరావు 'సినీ సంగీత సౌరభం' పుస్తకాన్ని విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న అంకోశా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత డాక్టర్ సాలూరు రాజేశ్వరరావు సంగీత విభావరి కార్యక్రమం పలువురుని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విశాఖ రసజ్ఞ వేదిక అధ్యక్షుడు డాక్టర్ జి. రఘురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అంకోశా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.కె.ఈ. అప్పారావు, కార్యదర్శి డాక్టర్ పీవీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షజాతుల సంక్షరణ అవసరం

మద్దిలపాలెం: వృక్షజాతుల సంరక్షణతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'తూర్పు కనుమల్లోని స్థానిక వృక్షజాతుల పరిరక్షణ' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా కోల్‌కతా శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.ఎస్.దాస్, సదస్సు కన్వీనర్ ఆచార్య ఎస్.బి.పడాల్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య డి.సంధ్యాదీపిక, ఆచార్యులు రత్నకుమార్, సుజాత, బలరామస్వామి యాదవ్, సంధ్యశ్రీ, ఎస్.ఎస్.దొర, విశ్రాంత ఆచార్యులు వెంకయ్య హర శ్రీరాములు, సీడీసీ డీన్ టి.వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతి ఇస్తున్న పూజారి వాసుపల్లి విజయమ్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఏకాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతుల కల్పనకు ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండకు భక్తులు ఇబ్బందులు పడకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎండల తీవ్రతకు శాశ్వత షెల్టర్ నిర్మించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సందడి



ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: సెయింట్ పీటర్స్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం ఉత్సాహంగా సాగింది. 1987–88 బ్యాచ్‌కి చెందిన ఈ విద్యార్థులంతా స్పర్శ స్వచ్ఛంద సంస్థ ద్వారా మధురవాడ ఐటీ హబ్‌లోని ఎస్ కన్వెన్షన్‌లో కలిశారు. దేశ విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరూ ఒకే వేదికగా కలుసుకుని ఆత్మీయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. 50 ఏళ్ల వయసు దాటినా 20 ఏళ్ల కుర్రాళ్లలా డ్యాన్స్‌లు వేస్తూ ఎంజాయ్ చేశారు. ఈ రోజున ఎటువంటి పనులు పెట్టుకోకుండా సెల్ ఫోన్ జీవితాన్ని పక్కన పెట్టి చిన్ననాటి మిత్రులతో కలిసి ఆనందంగా గడపడం సంతోషంగా ఉందని, పదేళ్ల కిందట అందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న స్పర్శ సంస్థ ప్రతి ఏడాది అక్టోబర్‌లో ఒక రోజు మిత్రుల ఆత్మీయ కలయికను పండగ వాతావరణంలో జరుపుకుంటామని స్పర్శ వ్యవస్థాపక సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ చేసి విజయవంతం చేసిన కముజు, రషీద్, సంజయ్‌లతో పాటు పూర్వ విద్యార్థులు డాక్టర్ చిప్పాడ రమేష్, బిల్డర్ కర్రి సంజయ్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ట శ్రీరాములు, కార్యదర్శి శ్రీను, జాయింట్ కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి పెంటకోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సిస్టర్ నివేదిత జయంతి



సిస్టర్ నివేదిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు

డాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద సంస్థలో సిస్టర్ నివేదిత జయంతి నిర్వహించారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. తొలి రోజు ఆదివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని సిస్టర్ నివేదిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిస్టర్ నివేదిత వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళా అని కొనియాడారు. ఆమె వివేకానంద ప్రియ శిష్యురాలని, మహిళా విద్యాభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేశారన్నారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడిందని అర్థమన్నారు. 1889లో కోల్‌కతా వాసులకు ప్లేగు వ్యాధి సంభవించినప్పుడు తన శిష్యులతో కలిసి వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందించారని, మానవసేవే–మాధవ సేవగా మనం కూడా ఆ మార్గంలోనే సేవలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్నేహ సంధ్య ఏజీకేర్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు పుండరీకాక్షయ్య, పి. సత్యవంతరావు, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత



విద్యార్థులతో ఎల్ ఏంజిల్స్ ప్రతినిధులు

సీతమ్మధార: జపాన్‌కు చెందిన ఎల్ ఏంజిల్స్ వలంటీర్స్ అసోషియేషన్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీతో కలిసి 30 మంది ప్రతిభ గల పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో చదవుతూ 85 శాతానికి పైగా మార్కులు సాధించిన ప్రతిభ గల విద్యార్థులను ఇందుకు ఎంపిక చేశారు. ఆదివారం ఆశీలమెట్టలోని ఒక హోటల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోటరీ 3020 పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్.కె.జైన్ పాల్గొని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా 30 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేసేందుకు వీలుగా నిధులు ఏర్పాటు చేసిన ఎల్ ఏంజిల్ ఇంటర్నేషనల్ వలంటీర్సు అసోషియేషన్ (లైవా) ఇంటర్నేషనల్ కో–ఆర్డినేటర్, రోటరీ క్లబ్ విశాఖ వ్యాలీ సీనియర్ రొటేరియన్ మండ వెంకట జానకిరామ్‌ను అభినందించారు. వెంకట జానకిరామ్ మాట్లాడుతూ ప్రతిభ గల పేద విద్యార్థులు చదువుకునేందుకు ఎటువంటి ఇబ్బంది కలగకూడదనే సంకల్పంతో నిధులు సమకూరుస్తున్నామన్నారు. నిరుపేద కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జాతికి నిజాయితీగా సేవలందించడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ఎస్.హనుమంతరావు, బి.బాబ్జి, జి.పాండురంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

డాబాగార్డెన్స్: విశాఖ నగర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకార సంఘం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ, గాయత్రి విశ్వకర్మ యువజన సేవా సంఘం, విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలు సంఘాల పర్యవేక్షణలో ఆంధ్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం పాత నగరంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికి గుండె, బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రాష్ట్ర స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు, హైకోర్టు అడ్వకేట్ అడవికొలను వేణుగోపాల్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. వీరబ్రహ్మేంద్రస్వామి చిరు విగ్రహాన్ని, సంపూర్ణ చరిత్ర గ్రంథాన్ని బహూకరించారు. కార్యక్రమంలో నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గురజాపు రవి, కార్యదర్శి పందూరు శేఖర్, సంఘ సలహాదారుడు బంగారు సురేష్, అడవికొలను రాధ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు తక్షణమే రంగంలోకి దిగాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

డాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించే విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తక్షణమే రంగంలోకి దిగి స్టీల్‌ప్లాంట్‌ని కాపాడాలని సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. జగ్గునాయుడు తెలిపారు. ఆదివారం సిటు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో ఇప్పుడు రంగంలోకి దిగకపోతే చేజారిపోయినట్టేనన్నారు. సంస్థను దిగజార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఉద్యోగులకు జీతాలు సకాలంలో ఇవ్వక, వారిని వీఆర్ఎస్ తీసుకునేటట్టు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, సెక్యూరిటీ సిబ్బందికి కూడా జీతాలు ఇవ్వక ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్టీల్‌ప్లాంట్‌ని అభివృద్ధి బాట పట్టిస్తామన్నారని.. అభివృద్ధిని పక్కన పెడితే మునిగిపోకుండా చూడాలని హితవు పలికారు. కృష్ణారావు, సూరీడు పాల్గొన్నారు.

నిత్యాన్నదానం ప్రారంభం

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు కొత్త వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా మాదిరిగా ఆదివారం మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభించారు. ధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయం వద్ద సంఘ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పీలా కనకరాజు మాట్లాడుతూ దాతల సాయంతో ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు 41 రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని, మాలధారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొంచి ఉన్న ప్రమాదం



రామకృష్ణా జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అరటి బొంద



సింహాలదేవిడి వద్ద ఏర్పాటు చేసిన చెట్టు కొమ్మలు

అల్లిపురం: ప్రమాదాలు చెప్పిరావు.. మనమే జాగ్రత్తపడాలి. ముందు చూడండి.. ప్రమాదం పొంచి ఉంది.. అన్నట్లు బాధ్యత గల పౌరులు ప్రమాదాలకు సూచికంగా చెట్ల కొమ్మలు, అరటి బొందలు పెట్టి తమ కర్తవ్యం నిర్వహించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో సింహాలదేవిడి వద్ద పాలబూత్ ఎదురుగా కాలువపై పలక విరిగిపోవటంతో ప్రమాదకరంగా మారింది. వాహన చోదకులు ప్రమాదాల బారిన పడకుండా స్థానికులు చెట్టు కొమ్మలను ప్రమాద సూచికగా పెట్టడంతో అప్రమత్తమవుతున్నారు. అదే విధంగా రామకృష్ణా రైతు మార్కెట్ జంక్షన్‌లోని ఫిష్ మార్కెట్ వద్ద కల్వర్టుపై పలక విరిగిపోవటంతో ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానికులు ప్రమాదసూచికగా అరటి చెట్టు బొంద పెట్టి ఇటుగా ప్రయాణించడం ప్రమాదం అని అప్రమత్తం చేయడంతో వాహన చోదకులు జాగ్రత్త పడుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది ప్రమాదాల నివారణకు కొత్త పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు, వాహన చోదకులు, పాదచారులు కోరుతున్నారు.

విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాస రచన పోటీలు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: స్థితప్రజ్ఞ ఫౌండేషన్ ఆదివారం పాత నగరంలో గల ఆర్యవైశ్య యువజన సంఘం వాసవీ భవన్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్‌లో పోటీలు నిర్వహించారు. చిల్డ్రన్స్‌డే సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర పరిధిలో గల 30 స్కూళ్ల నుంచి వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవీవీ సత్యనారాయణ పోటీలు ప్రారంభించి మాట్లాడారు. నవంబర్ 3న క్విజ్, వక్తృత్వ పోటీలు, 9న ఫైర్‌లెస్ కుకింగ్, చెస్, సింగింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ట్రస్టీ ప్రదీప, కె. రామకృష్ణ, ఎస్. శివప్రసాద్, వెంకటేష్, శీలా, ప్రశాంతి, దుర్గబాబు, భాస్కర్, ప్రవీణ్, సాయి, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జ్ఞానాపురంలోని ఎర్రిగెడ్డను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ, జెడ్సీ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో జోన్–5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, అధికారులతో కలిసి ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ ఆదివారం పర్యటించారు. ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరియదాస్ కల్యాణ మండపాల నిర్మాణంపై దృష్టి సారించాలని, రోడ్లు, కాలువలకు మరమ్మతులు, శానిటరీ సమస్యల పరిష్కారం, ఎర్రిగెడ్డ ముంపు సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరావు, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ. సునీల్‌కుమార్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ అధికారులపై కార్పొరేటర్ మండిపాటు

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వార్డు పర్యటనపై తనకు సమాచారం లేకపోవడం పట్ల 41వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ మండిపడ్డారు. జోనల్ అధికారులు ప్రొటోకాల్ పాటించకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని అన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధితులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సంచాలకులు రజని

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన గిరిజన విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ పేర్కొన్నారు. అరకు వ్యాలీ గురుకుల (పి.వి.టి.) పాఠశాల విద్యార్థి బద్నాయిని ప్రవీణ్‌కుమార్ మృతదేహానికి కేజీహెచ్‌లో ఆదివారం పోస్టుమార్టం పూర్తి చేశారు. అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించి ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ పొల్లిపుట్టు గ్రామానికి అంబులెన్సులో తరలించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సంచాలకులు ఎల్. రజని శనివారం రాత్రి కేజీహెచ్‌ను సందర్శించి విద్యార్థి తల్లిదండ్రులను ఓదార్చారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తయ్యే వరకు ఉప సంచాలకులు అక్కడే ఉండి మృతదేహం తరలింపు ఏర్పాట్లు చేశారు. ఇటువంటి సంఘటన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాల్లో పునరావృతం కాకుండా ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ఇస్తామని అధికారులు వెల్లడించారు.

విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: జేవీవీ చెకుముకి సంబరాల్లో భాగంగా నవంబర్ 19 నుంచి 21 వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రావు, ప్రొఫెసర్ పద్మ, జేవీవీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బాలోత్సవ ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ గత ఏడాది బాలోత్సవంలో 6 వేల మంది పిల్లలు 95 స్కూల్స్ నుంచి 74 ఈవెంట్లలో పాల్గొన్నారని తెలిపారు. ఈ సంవత్సరం కూడా బాలోత్సవాన్ని సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నామని తెలిపారు. గతం కన్నా ఎక్కువ మంది పిల్లలు ఎక్కువ స్కూళ్ల నుంచి పాల్గొంటారని ఆశిస్తున్నామన్నారు. చెకుముకి సంబరాలకు హాజరయ్యే కరస్పాండెంట్లు, హెడ్మాస్టర్లు, ప్రిన్సిపాళ్లు, టీచర్లు సహకారం అందివ్వడం ద్వారా ఎక్కువ మంది పాల్గొనేటట్టు చూడాలని, పెందుర్తి నుంచి ఎన్ఏడీ కొత్త రోడ్డు వరకు ఉన్న స్కూళ్లకు డిసెంబర్‌లో ప్రత్యేకంగా నిర్వహిస్తామని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి గోపాలరావు, ఉపాధ్యక్షుడు మురళీధర్, జిల్లా నాయకులు ఎస్‌వీకే పరశురామ్, శేషగిరిరావు, లక్ష్మణస్వామి, రమేష్, ప్రసాద్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.